నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**నిషిత తిరునగరి**

మిస్ క్వీన్ ఆఫ్ ది వరల్డ్ ఇండియా–2023 పోటీలు ఢిల్లీలో అక్టోబర్ 20న నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ పట్టణానికి చెందిన తిరునగరి నిషిత రెండో రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలో విజేతగా అబోలి కాంబ్లీ నిలువగా, మొదటి రన్నరప్‌గా అంజలి నంది ఎంపికయ్యింది. అదేవిధంగా Ms కేటగిరీలో గాయత్రిదేవి, Mrs కేటగిరీలో ప్రియా సాగి విజేతలుగా నిలిచారు.

nipuna
Every Wednesday Free Supplement
03.
8 నవంబర్ 2023
పేజీలు 8

# ఏసు క్రీస్తు.. అనుచరులతో 'చివరి భోజనం' ఎప్పుడు చేశారు?

## క్రిస్మస్

- ఏటా డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకొనే పండుగ. ఈ రోజున క్రైస్తవ మత స్థాపకుడు ఏసుక్రీస్తు జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని, బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. చర్చిల్లో బాల ఏసు గీతాలను ఆలపిస్తారు. తమ ఇళ్ల ముందు క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు.



- ఏసుక్రీస్తు దేవుడి వరం వల్ల మేరీమాతకు జన్మించాడు. క్రీస్తు జన్మతః యూదు. జన్మస్థలం బెత్లెహామ్. క్రీస్తు జన్మించినప్పుడు అక్కడి పాలకుడు హేరోదుకు పండితులు ఒక గొప్పరాజు జన్మించాడని చెప్పారట. అప్పుడు పరిసరాల్లో రెండేళ్లలోపు పిల్లల్ని చంపేయమని ఆజ్ఞాపించాడు. దాంతో క్రీస్తును ఆయన కుటుంబ సభ్యులు మొదట ఈజిప్టుకు, తర్వాత నజరేత్‌కు తీసుకెళ్లిపోయారు.
- పెరిగి పెద్దయిన ఏసు క్రీస్తు తన 12 మంది అనుచరులతో కలిసి ప్రేమ, క్షమ, సహనం, శాంతి కలిగి ఉండాలని బోధించాడు. ఆపన్నులకు సహాయం చేశాడు. ఇదంతా తమ మతాధిపత్యానికి అడ్డుగా భావించిన యూదు మత పెద్దలు స్థానిక రోమన్ అధికారులకు క్రీస్తు మీద ఫిర్యాదు చేశారు. దాంతో జెరూసలేం నగరం బయట రోమన్ అధికారులు క్రీస్తుకు శిలువ వేశారు. తెలుస్తున్న దాన్ని బట్టి క్రీస్తు జీవితకాలం క్రీ.పూ.4 నుంచి క్రీ.శ. 30 మధ్యకాలం.

## గుడ్ ఫ్రైడే

- దీన్ని క్రీస్తుకు శిలువ వేసిన దినాన్ని స్మరించుకుంటూ జరుపుకొంటారు. ఏప్రిల్‌లో శుక్రవారం వచ్చే ఈ గుడ్‌ఫ్రైడే రోజున క్రైస్తవులు ఉపవాసం ఉంటారు. చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేస్తారు. దీని తర్వాత వచ్చే ఆదివారాన్ని ఈస్టర్ అంటారు. క్రీస్తు తాను మాట ఇచ్చిన ప్రకారం శిలువ వేసిన మూడో రోజున పునరుత్థానం చెందిన రోజే ఈస్టర్.
- గుడ్‌ఫ్రైడేకి ముందురోజు గురువారం క్రీస్తు తన అనుచరులతో 'చివరి భోజనం' చేసిన రోజు కాగా, ఈస్టర్‌కు ముందు శనివారాన్ని క్రీస్తుకు శిలువ వేయడానికి, ఆయన పునరుత్థానానికి సంధిదినంగా జరుపుకొంటారు.

## పైడితల్లి సిరిమాను ఉత్సవం

- ఈ ఉత్సవానికి వేదిక ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం పట్టణం. క్రీ.శ.1757లో జరిగిన సంఘటన ఈ సిరిమాను ఉత్సవానికి కారణం. అప్పట్లో ఈ ప్రాంతంలో విజయనగరం, బొబ్బిలి రెండు ప్రధానమైన జమీందారీలు. ఫ్రెంచి వర్తక కంపెనీ కుట్రవల్ల 1757లో విజయనగరం, బొబ్బిలి జమీందారులకు బొబ్బిలి యుద్ధం జరిగింది. దీనిలో విజయనగరం జమీందారు విజయరామరాజు గెలిచాడు. కానీ ఫ్రెంచి సేనాని బుస్సీ కుట్రవల్ల ఆయన తాండ్ర పాపారాయుడి చేతిలో మరణించాడు.
- అయితే, అప్పటికే తన అన్నను యుద్ధానికి వెళ్లొద్దని విజయరామరాజు సోదరి పన్నెండేళ్ల పైడిమాంబ హెచ్చరించింది. కీడు శంకించిన ఆమె తన అన్న కోసం యుద్ధభూమికి బయల్దేరింది. ఇంతలో అన్న మరణవార్త తెలియడంతో ఆమె విజయనగరంలోని పెద్ద చెరువులో సమాధి అయ్యింది.
- ఆ సమయంలో తన వెంట ఉన్న పతివాడ అప్పలనాయుడుకు తాను చెరువులో విగ్రహంగా అవతరించే విషయాన్ని వెల్లడించింది పైడిమాంబ. అప్పటినుంచి అప్పలనాయుడి కుటుంబీకులే పైడితల్లి అమ్మవారి దగ్గర పూజారులుగా సేవలందిస్తున్నారు.
- పైడిమాంబ త్యాగానికి గుర్తుగా ఏటా దసరా తర్వాత మంగళవారం నాడు సిరిమాను ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఉత్సవానికి ముందురోజు 'తొలేలు' కార్యక్రమం నిర్వహిస్తారు. అదే రోజు రాత్రివేళలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా వనం గుడి నుంచి కోట దగ్గరికి తీసుకెళ్తారు.
- కోట శక్తికి పూజలు చేసిన తర్వాత ఈ ఘటాలను మళ్లీ గుడికి తీసుకొస్తారు. ఆలయ పూజారి భక్తులకు అమ్మవారి జీవిత గాథను వివరిస్తాడు. ఆ తర్వాత రైతులకు విత్తనాలను ఇస్తారు. పంట వేసేముందు వీటిని వేస్తే బాగా పండుతాయని ఇక్కడివాళ్ల విశ్వాసం. తొలి, వేళ్లు అనే పదాలే తొలేలుగా మారింది.



**సిరిమాను అంటే..**

- పండుగకు నెలముందే ఆలయ పూజారికి అమ్మవారు కలలో దర్శనమిచ్చి ఆ ఏడాది సిరిమానుగా ఉండే చింతమాను దిశను సూచిస్తుంది. ఆ దిక్కుకు వెళ్లి చింతమానును తెస్తారు. సుమారు 50 అడుగుల ఎత్తుండే ఈ మానును ఎడ్లబండి మీద ఇరుసుల మధ్య బిగిస్తారు. మాను పైచివరన పూజారి కూర్చునేందుకు ఒక పీఠాన్ని అమరుస్తారు. ఆయనలోనే భక్తులు పైడితల్లి అమ్మవారిని చూసుకుంటారు. సిరిమాను విజయనగరంలోని మూడు లాంతర్ల నుంచి కోట వరకు మూడు సార్లు తిరుగుతుంది.
- యాత్రలో సిరిమానుకు ముందు పోతరాజు వేషధారి, అక్కాచెల్లెళ్ల వేషాలు వేసుకున్న ఏడుగురు మగవాళ్లు కూర్చున్న ఏనుగు బొమ్మ ఉన్న శకటం, అంజలి రథంగా చెప్పే బండి మీద అమ్మవారి పరిచారికలకు ప్రతీకలుగా ఐదుగురు మగవాళ్లు కూర్చుంటారు. వీళ్లు అమ్మవారికి నమస్కరిస్తుంటారు. అందుకే అంజలి అని పేరు వచ్చింది. ఊరేగింపు ముందు వరుసలో అమ్మవారి విగ్రహాన్ని చెరువు నుంచి బయటకు తీసిన సంఘటనకు గుర్తుగా జాలరి వల ఉంటుంది. అమ్మవారి సైనిక శక్తికి ప్రతిరూపంగా పాలధార కూడా ఊరేగింపులో పాల్గొంటుంది.
- సిరిమాను తర్వాత వచ్చే మంగళవారం నాడు జరిగే ఉయ్యాల కంబాల స్తంభానికి ఊయల కట్టడంతో పైడితల్లి జాతర ముగుస్తుంది.

## పుష్కరాలు

- పుష్కరం అంటే పన్నెండేళ్ల కాలం. హిందూ కాలమానంలో సంవత్సరాన్ని 12 రాశులుగా విభజించారు. అవి.. మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం. సూర్యుడు నెలకు ఒక రాశి చొప్పున సంవత్సరం పూర్తయ్యేసరికి అన్ని రాశుల్లో ఉంటాడు. సౌర కుటుంబంలో పెద్ద గ్రహం బృహస్పతి (గురుడు). పుష్కరాలకు బృహస్పతి గమనాన్ని ఆధారంగా తీసుకున్నారు. అలా గురుడు ఏటా ఓ ప్రత్యేక రాశిలో ఉన్నప్పుడు దేశంలోని 12 ముఖ్యమైన నదులకు పుష్కరాలను నిర్వహించడం ఆచారంగా వస్తున్నది.



- బృహస్పతి ఆయా రాశుల్లోకి వచ్చిన మొదటి 12 రోజులు, చివరి 12 రోజులను పుష్కరాల మొదలు, చివరగా పరిగణిస్తారు. ఈ సమయంలో దేవతలందరూ నదిలో కొలువై ఉంటారని నమ్ముతారు. అందుకని పుష్కరాల సమయంలో భక్తులు ఆయా నదుల్లో స్నానం చేసి, నదీమాతలకు పూజలు చేస్తారు.
- పుష్కరాలు జరపడం వెనుక ఓ పురాణ గాథ ఉంది. ఓ మారు జలాధిపతి అయిన వరుణుడి కొడుకు పుష్కరుడు బ్రహ్మదేవుడిని ఉద్దేశించి తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమన్నాడు. దానికి పుష్కరుడు బ్రహ్మతో 'నీ కమండలంలో ఉండి, నదులకు పవిత్రత కల్పించే వరాన్ని ప్రసాదించండి' అని అడిగాడు. అప్పుడే బృహస్పతి కూడా బ్రహ్మదేవుడి గురించి తపస్సు చేసి బ్రహ్మను పుష్కరుడిని తన వెంట పంపించమని అడిగాడు. దీనికి పుష్కరుడు ఒప్పుకోలేదు. దాంతో బ్రహ్మదేవుడు.. ఏడాదికి ఓ మారు గురుడు ఓ ప్రత్యేక రాశిలో ఉన్నప్పుడు పన్నెండు రోజులపాటు పుష్కరుడు గురుడి వెంట ఉండాలి అని పరిష్కారం చెప్పాడట. అలా పుష్కరాలు జరుపుకోవడం మొదలైందని అంటారు.

## జల్లికట్టు

- భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. అందుకే ఇక్కడి సంస్కృతిలో ఆవులు, బర్రెలు, ఎద్దులు తదితర జంతువులను కుటుంబంలో భాగంగా పరిగణిస్తారు. ఆవును గోమాతగా, ఎద్దును 'నంది'గా పూజిస్తారు. ఎద్దులను అందంగా అలంకరించి బండి కట్టి జాతరల సందర్భంగా గుడి చుట్టూ తిప్పుతారు. గంగిరెద్దుల ఆట తెలిసిందే. పండుగల్లో సంక్రాంతి (పొంగల్) మరునాటి రోజు కనుమను ప్రత్యేకంగా పశువులకే కేటాయించారు. తమిళనాడులో కనుమను 'మాట్టు పొంగల్ (ఎద్దు పొంగల్)' లేదా మంజు విరాట్టుగా జరుపుకొంటారు.
- అదే రోజు తమిళనాడులోని మధురై, రామనాథపుర జిల్లాల్లో కంగాయం తదితర చోట్ల ఎద్దులను నిలువరించే 'జల్లికట్టు' క్రీడలను నిర్వహిస్తారు. ఇది చల్లి (నాణేలు), కట్టు (కట్టిన/ బంధించిన) అనే రెండు తమిళ పదాల కలయిక. పూర్వం ఎద్దు కొమ్ములకు నాణేలు కట్టేవారు. పరుగెడుతున్న ఎద్దు మూపురం పట్టుకొని ఆపి, దాని కొమ్ముల నుంచి ఈ నాణేల దండను తీసేవాళ్లు. అలా చేయగలిగిన వాళ్లే జల్లికట్టు విజేతలు.
- ప్రాచీన తమిళ కావ్యం శిలప్పాదికారంలో కూడా ఈ ఆట ప్రస్తావన ఉంది. దీన్నుంచి జల్లికట్టు ప్రాచీనత తెలుస్తుంది.
- అయితే, జల్లికట్టులో భాగంగా ఎద్దులను నిలువరించడానికి వాటికి మద్యం తాగించడం, కర్రలతో కొట్టడం, కళ్లలో కారం చల్లడం చేస్తారు. చుట్టూ ఉన్న జనం అరుపులు, తమను ఆపేందుకు ముందుకు వచ్చే వాళ్లను చూసి బెదిరిన ఎద్దులు పక్కన ఏర్పాటు చేసిన బారికేడ్ల మీది నుంచి ఎగిరి కిందపడి గాయపడటం, ఒక్కోసారి తమను ఆపే ప్రయత్నం చేసేవాళ్లను, అక్కడ గుమికూడిన జనాన్ని పొడవటం చేస్తుంటాయి.



- ఇలాంటి ఘటనల్లో జనం గాయపడటం, కొన్నిసార్లు ఈ క్రీడ ప్రాణాంతకంగా పరిణమించడమూ జరుగుతుంది. దీంతో 'పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్' సంస్థ జల్లికట్టును నిషేధించమని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. వివిధ సందర్భాల్లో విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు, సుప్రీంకోర్టు జల్లికట్టు మీద నిషేధం విధించాయి.
- అయితే, తమిళనాడు ప్రజలు చెన్నైలోని మెరీనా బీచ్‌లో 2017, జనవరి 8న 'జల్లికట్టును రక్షించండి' అంటూ నిరసనలు తెలిపారు. దీంతో 2017, జనవరి 23న తమిళనాడు శాసనసభ రాష్ట్రపతి ఆమోదంతో జంతువుల పట్ల హింస నివారణ చట్టం 1960 నుంచి జల్లికట్టును మినహాయిస్తూ ఒక ద్వైపాక్షిక బిల్లును ఆమోదించింది.
- న్యాయస్థానాలు నిషేధం విధించినా ప్రజలు జల్లికట్టు వైపు మొగ్గుచూపడానికి కొన్ని కారణాలున్నాయి. అవి.. జల్లికట్టు ద్వారా రైతులు, ఎడ్లు తమ శక్తి సామర్థ్యాలను మెరుగుపరుచుకుంటారు. తమిళ వ్యవసాయ కుటుంబాల వారు ఎడ్లను తమ కుటుంబంలో భాగంగా పరిగణిస్తారు. పైగా పురాతనమైన జల్లికట్టును నిషేధిస్తే తమ ప్రాంతానికే ప్రత్యేకమైన పులికులం (కంగాయం) జాతి ఎడ్ల అవసరం తగ్గి చివరికి అవి అంతరించే ప్రమాదం ఉందంటారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు జల్లికట్టు నిషేధం మీద స్టే విధించింది.



## బోనాల పండుగ

- తెలంగాణలో ఆషాఢ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరుపుకొనే వేడుక బోనాల పండుగ. ఇది జానపదుల భక్తి విశ్వాసాలకు ప్రతీక. ఆషాఢ మాసంలో వర్షాల కారణంగా పరిసరాలు చిత్తడిగా మారతాయి. రోగకారక క్రిములు వ్యాప్తి చెందుతాయి. వీటి బారిన పడకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే గ్రామదేవతలను పూజించడమే మార్గమన్నది జానపదుల నమ్మకం. బోనాలది ఐదు వందల ఏండ్ల చరిత్ర. 15వ శతాబ్దంలో హైదరాబాద్ నగరంలో ఏటా వర్ష రుతువులో గత్తర ప్రబలి ప్రాణనష్టం జరిగేది. ఈ మహమ్మారి నుంచి తమను కాపాడమని స్థానికులు గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం మొదలుపెట్టారు. అది నేటికీ కొనసాగుతుంది.
- బోనాల వేడుక గోల్కొండ కోటలోని అమ్మవారి గుడి నుంచి ప్రారంభమవుతుంది. ఘటం ఎదుర్కోళ్లతో ఉత్సవానికి శ్రీకారం చుడతారు. పసుపు కలిపిన నీళ్లు, వేపాకుల్ని చల్లుకుంటూ భక్తులు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు తరలివస్తారు. అమ్మవారికి మొక్కుకున్నవారు పాత్రల్లో బోనాల్ని సిద్ధం చేస్తారు. తర్వాత అమ్మవారికి పసుపు నీళ్లు సమర్పిస్తారు. సాకబెట్టడం అంటే ఇదే.
- వేడుకలు జరిగినన్నాళ్లూ అమ్మతల్లికి నివేదించేందుకు 'ఫలహారం బండ్ల'ను గుళ్లకు తీసుకెళ్తారు. ఇంకా పోతరాజులు, భవిష్యవాణి వినిపించే 'రంగం', గావుపట్టడం (గొర్రె, మేక, కోడి మెడనరం కొరికేయడం) మొదలైనవి బోనాల్లో ప్రధాన అంశాలు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళితో పతాకస్థాయికి చేరుకునే బోనాలు లాల్‌దర్వాజ అక్కన్న మాదన్న గుడిలో తుది సమర్పణతో ముగిసిపోతాయి. చివరగా అమ్మవారిని నగర వీధుల్లో 'సాగనంపు' పేరుతో ఊరేగిస్తారు.
- బోనాలు, బతుకమ్మ పండుగలను తెలంగాణ ప్రభుత్వం 2014, జూన్ 16న రాష్ట్ర ఉత్సవాలుగా ప్రకటించింది.

సంకలనం
**హర్షవర్ధన్ చింతలపల్లి**